అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడి న్యాయం చేస్తాం
- ఎల్లప్పుడూ ప్రజాక్షేత్రంలోనే ఉంటా
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ముత్తుకూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : ఓటమి పాలైనంత మాత్రాన కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రజా సేవకుడిగా అందరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ముత్తుకూరు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను మంగళవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తాము నిరంతరం ప్రజల మధ్యే ఉంటామని, ఎవరికి ఏ కష్టం వచ్చినా నిలబడుతామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలు, పింఛన్ల పంపిణీలో అర్హులకు టీడీపీ ప్రభుత్వం వల్ల అన్యాయం జరిగితే న్యాయ పోరాటం ద్వారా సాధిస్తామన్నారు. మండలంలో శాయశక్తులా అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మత్స్యకారేతర ప్యాకేజీని పంపిణీ చేశామన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇప్పించగలిగామన్నారు. నేలటూరుపాళెం వద్ద ఫిషింగ్ జెట్టీ నిర్మాణం చేపట్టగలిగామని గుర్తుచేశారు.

ఇంటింటికీ పింఛన్ జగన్ పుణ్యమే

సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ జరిగిందంటే దీనికి కారణం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారణమని కాకాణి పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ వైఎస్ జగన్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కూటమి పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు. పెంచిన మొత్తంతో పింఛన్లను పంపిణీ చేయడం సంతోషమే అయినా ఈ సందర్భంగా మాజీ సీఎంను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంవీపాళెం సర్పంచ్ మునుకూరు జనార్ధనరెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, ఈదూరు రామ్‌ప్రసాద్‌రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా నాయీ బ్రాహ్మణ సేవాసంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పూజలు, మేళతాళాలు, బాణసంచాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

రామలింగేశ్వరునికి నంది వాహనసేవ


నంది వాహనంపై స్వామి, అమ్మవార్లు

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం నంది వాహనసేవ జరిపించారు. లోకంలో ధర్మం నాలుగు పాదాల మీద నడవాలన్న ఆకాంక్షతో నందివాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. తొలుత ప్రత్యేక వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి విశేషాలంకరణ చేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం


పూజలు చేస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో మంగళవారం ముగిశాయి. భద్రాచలంలోని సీతారామస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధ్వజావరోహణ, మహాకుంభప్రోక్షణ, ఏకాంతసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా చల్లా చైతన్యకుమార్‌రెడ్డి, శిరీష దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, శంకర్, మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


విద్య ఆవశ్యకతపై అవగాహన

నెల్లూరు (టౌన్): బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు శారద తెలిపారు. నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో ర్యాలీని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించి విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్, ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, సీఎంఓ పెంచలయ్య, ఐటీడీఓ ఎంఓ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేయూ జిల్లా నూతన కమిటీ నియామకం



నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయూ) జిల్లా నూతన కమిటీని నియమించామని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకుమాను వెంకటవేణు తెలిపారు. ఈ మేరకు బాలాజీనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ద్వారం వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ సలహాదారుడిగా రామచంద్రమూర్తి, జిల్లా అధ్యక్షుడిగా మనాపాటి చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి గర్రే వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మదన్, ఉపాధ్యక్షుడిగా మురళీమోహన్, సంయుక్త కార్యదర్శిగా యాదాల కృష్ణకిషోర్‌ను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కమిటీ పనిచేయాలని సూచించారు.

సమష్టిగా ముందుకు సాగుదాం

- మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు సాగుదామని మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టంగుటూరు మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..

కోవూరు : 'పార్టీ కోసం పనిచేసిన వారు అధైర్య పడొద్దు.. అందరికీ అండగా ఉంటా.. కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం' అని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు గాజుల మల్లికార్జున్‌కు ఇటీవల బ్రెయిన్ సంబంధిత సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాళెంలో ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మల్లికార్జునను ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి ఇలాంటి సమయంలోనే తోడుగా ఉండాలన్నారు. ఆయన వెంట నిరంజన్‌బాబురెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నరసింహులురెడ్డి, మొర్ల మురళి, రమణయ్య, వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ వాణి, రాజ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి విగ్రహం బహూకరణ

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు అభయాంజనేయస్వామి విగ్రహాన్ని గాజుల మల్లికార్జున్, సుప్రజ దంపతులు బహూకరించారు. దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు.


కోవూరు : పార్టీ నేతను పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

డెంగీ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి దేవీ కృప

ముత్తుకూరు : డెంగీ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి దేవీకృప సూచించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన 'డెంగీ వ్యతిరేక మాసోత్సవం'లో ఆమె పాల్గొని, ప్రసంగించారు. నేషనల్ వెక్టార్ బార్ డిసీజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా వర్షాకాలంలో కీటకాల వల్ల వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దోమలు పెరిగే ప్రదేశాలు, నీటి స్థావరాలు, ఈగలు, ఉడతలు, ఎలుకలు, బొద్దింకల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎస్‌యూఓ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణంరాజు, హెల్త్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చేర్చాలి

కొడవలూరు: ప్రభుత్వ పాఠశాలలు లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే పిల్లలను చేర్చాలని ఎంఈఓ జి.వసంతకుమారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కొడవలూరు మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు ఉన్నత పాఠశాలలు-5, ప్రాథమికోన్నత పాఠశాలలు-5 ఉన్నాయన్నారు. రామన్నపాళెంలోని శివసాయి, నార్తురాజుపాళెంలోని ఎస్వీ మందిర్, రేగడిచెలికలోని ప్రణవి, బొడ్డువారిపాళెంలో ఓవెల్ ఇండియా, బుచ్చి రోడ్డులోని ఒవెల్-18 హైస్కూళ్లు ప్రభుత్వ గుర్తింపు పొంది ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా గండవరంలోని సెయింట్ మేరీ, నార్తురాజుపాళెంలోని వశిష్ట, హయగ్రీవ, యల్లాయపాళెంలోని కేమ్ బ్రిడ్జి, న్యూ కేమ్ బ్రిడ్జి ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు పొంది ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని లేనిపక్షంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే చేర్చాలని సూచించారు.

అధ్వానంగా కందలపాడు రోడ్డు


రాళ్లు తేలిన కందలపాడు రోడ్డు

వెంకటాచలం : మండలంలోని కందలపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గంపై అడుగడుగునా గోతులు పడడంతో ఇటీవల అధికారులు రోడ్డును మరమ్మతులు చేపట్టేందుకు తవ్వించారు. అనంతరం అలానే వదిలేశారు. మరమ్మతుల పనులు చేపట్టకపోవడంతో గ్రామానికి రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలిపోయి ఉండడంతో ప్రయాణం నరకమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు త్వరితగతిన మరమ్మతు పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలేరమ్మకు నైవేద్యాల సమర్పణ


నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని పాటూరువారికండ్రిగ కాలనీలో గ్రామదేవత పోలేరమ్మకు మంగళవారం ఘనంగా నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూలతో విశేషంగా అలంకరించిన పోలేరమ్మ అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కోలాహలం నడుమ భారీగా బాణసంచా కాలుస్తూ, మేళతాళాల నడుమ సాంప్రదాయబద్ధంగా పూజలు ఆచరించారు. గ్రామాన్ని చల్లగా సంరక్షించాలని వేడుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీటీపీ ప్రతినిధులు

ముత్తుకూరు : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 117 నంబర్ జీఓను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని బీటీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. బీటీపీ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని బ్రహ్మదేవి, ముత్తుకూరు, డమ్మాయపాళెం, ఈపూరు, వెంకనపాళెం పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధుసూదనతో మాట్లాడుతూ, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, రాజా రహమతుల్లా, విజయకుమార్, రఘురామయ్య, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన మురళీధర్ పని నిమిత్తం మోటార్ బైక్‌పై కృష్ణపట్నం వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా తాటిపర్తిపాళెం సమీపంలో కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అభివృద్ధిపై దృష్టి సారిస్తాం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి


పోలేరమ్మ పూజలో సోమిరెడ్డి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కేఆర్ఆర్ నగర్‌లో ఉన్న ప్రసన్న పోలేరమ్మతల్లి పొంగళ్ల మహోత్సవంలో సోమిరెడ్డి మంగళవారం పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కండలేరు ఎత్తిపోతల పథకానికి కరెంటు బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం మండలంలోని నావూరు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోలేరమ్మ గ్రామ పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, బక్కయ్య నాయుడు, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను తెలియజేశారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం


కొడవలూరు : యల్లాయపాళెంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : అతిసార(డయేరియా) పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని యల్లాయపాళెం వైద్యాధికారిని కావ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డయేరియాపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. సురక్షితమైన నీటిని తాగడంతో పాటు పరిశుభ్రమైన, తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా డయేరియాను దూరం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ విజయ, హెచ్‌ఎస్‌లు సురేంద్ర, రజియ, ఎంఎల్‌హెచ్‌పీలు రోజ్‌మేరీ, జాస్మిన్, సౌమ్య, ఏఎన్‌ఎంలు సుకన్య, మహేశ్వరి, సుమతి, శాంతకుమారి, కీర్తి, మమత పాల్గొన్నారు.

ఎమ్మార్వో కాలనీలో..

పొదలకూరు : స్థానిక ఎమ్మార్వో కాలనీలో డయేరియా(వాంతులు, విరేచనాలు)పై ఆరోగ్యశాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహించి గ్రూపు సమావేశాలు ఏర్పాటు చేశారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, వేడిచల్లారక ముందే భోజనం చేయాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు ఉన్నవారు వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాధాకుమారి, శివప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ రత్నమ్మ, ఆశా కార్యకర్తలు సీత, లక్ష్మి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిన్నారులకు విద్యాసామగ్రి అందజేత


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని కాగులపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు విద్యా సామగ్రిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ పీవీ రత్నం మాట్లాడుతూ పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తదితర విద్యాసామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, దాతలు అందించే సహకారాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన


జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కొడవలూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నార్తురాజుపాళెం హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. మండలంలో ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలుండగా, ప్రతి పాఠశాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన ముగ్గురు వంతున 18 మంది విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ శేషు, జీవీ చలపతిశర్మ మాట్లాడుతూ యూటీఎఫ్ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, హైస్కూల్ హెచ్‌ఎంలు అన్నపూర్ణమ్మ, మోహన రామలింగయ్య, జి.శ్రీనివాసరావు, సంఘ జిల్లా కార్యదర్శి ఖాజావలి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.మాలకొండయ్య, పి.తిరుపాలు, సభ్యులు ఎ.కీర్తన, ఆర్.శైలజ, పి.విజయలక్ష్మి, జి.రమణమ్మ, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.

13న విద్యార్థులకు సత్కారం

నెల్లూరు(మినీబైపాస్): పదో తరగతిలో 450కుపైగా, ఇంటర్మీడియట్‌లో 750కుపైగా మార్కులను సాధించిన కుమ్మర, శాలివాహన విద్యార్థులను ఈ నెల 13న సత్కరించనున్నామని కుమ్మర శాలివాహన సంఘ నేతలు నరసయ్య, శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబాపురంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 95730 38716 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.